క్లుప్తంగా

పరామర్శ



శ్రీహరినాయుడుని పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్

రేగిడి: మండలంలోని దేవుదళ గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు, మాజీ ఎంపీటీసీ కెంబూరి శ్రీహరినాయుడును ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ శనివారం పరామర్శించారు. కొన్నాళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన పలు ఆస్పత్రుల్లో చికిత్స పొందిన అనంతరం ఇంటి వద్దనే కోలుకుంటున్నట్లు తెలుసుకున్న ఎమ్మెల్సీ.. ఆయన వద్దకు వెళ్లి, ఆరోగ్యంపై ఆరాతీశారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు కెంబూరి వెంకటేశ్వరరావు, కరణం శ్రీనివాసరావు, గార రమణ, పాలవలస దవళేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తాగునీరు వృథా చేయొద్దు



ఉనుకూరులో కుళాయిలను పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ శ్రీచరణ్

రేగిడి: తాగునీరు వృథా చేయొద్దని ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ శ్రీచరణ్ ప్రజలను కోరారు. మండలంలోని ఉనుకూరు, చిన్నశిర్లాం, పెద్దశిర్లాం తదితర గ్రామాల్లో ఆయన శనివారం పర్యటించి, తాగునీటి పైపులైన్లు, కుళాయిలను పరిశీలించి, పలు సూచనలు చేశారు. మరమ్మతులకు గురైన పైపులు బాగు చేయించారు.

ఎస్సీ వర్గీకరణ ఆర్డినెన్స్ జారీపై హర్షం

రాజాం: ఎస్సీ వర్గీకరణకు సంబంధించి, ఆర్డినెన్స్ జారీ అవ్వడం పట్ల ఎమ్మార్పీఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. శనివారం స్థానిక అంబేడ్కర్ జంక్షన్ వద్ద ఎస్సీ వర్గీకరణకు పోరాడిన మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఎస్సీ వర్గీకరణ ద్వారా ఎస్సీల్లోని 59 ఉపకులాలకు సమన్యాయం జరుగుతుందని ఎమ్మార్పీఎస్ నాయకుడు వై.నారాయణరావు అన్నారు. 30 ఏళ్ల సుదీర్ఘ పోరాటానికి ప్రతిఫలం వర్గీకరణ అన్నారు.

ఉపాధి పనుల పరిశీలన



వేతనదారులకు సూచనలిస్తున్న ఏపీవో హరనాధరావు

రేగిడి: మండలంలోని సంకిలి, చిన్నయ్యపేట, బొడ్డవలస తదితర గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను ఏపీవో ఎస్.హరనాధరావు శనివారం పరిశీలించారు. నిర్దేశిత కొలతల ప్రకారం పనులు చేస్తే రోజుకు రూ.307 వేతనం లభిస్తుందన్నారు. పని ప్రదేశంలో తాగునీరు, ప్రథమ చికిత్స కిట్, టెంట్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు.

పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి



వేతనదారులకు అవగాహన కల్పిస్తున్న ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ

వంగర: పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ప్రధానోపాధ్యాయుడు మత్స సత్యనారాయణ కోరారు. మండలంలోని గీతనాపల్లిలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలకు సంబంధించి, అడ్మిషన్ డ్రైవ్ శనివారం నిర్వహించారు. ఉపాధి హామీ పథకం పనుల ప్రదేశానికి వెళ్లి, ప్రభుత్వ విద్యాసంస్థల్లో కల్పిస్తున్న సదుపాయాలను వేతనదారులకు వివరించారు. ప్రభుత్వ బడుల్లోనే ఒత్తిడి లేని నాణ్యమైన విద్య అందించబడుతుందని తెలిపారు. గీతనాపల్లి, కొండచాకరాపల్లి, కె.కొత్తవలస గ్రామాల పిల్లలను కొప్పర జెడ్పీ ఉన్నత పాఠశాలలో చేర్పించాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు.

ఉపాధి బిల్లులపై..
మండల సమావేశంలో వాడీవేడి చర్చ

- ఉపాధి హామీ బిల్లుల చెల్లింపుల్లో జాప్యంపై సభ్యుల మండిపాటు
- కూటమి నేతల జేబుల్లోకి నిధులు మళ్లిస్తున్నారని ధ్వజం
- త్వరితగతిన వేతనదారులకు బిల్లులు చెల్లించాలని డిమాండ్



ఉపాధి బిల్లుల చెల్లింపుల్లో నిర్లక్ష్యంపై ఏపీవోను నిలదీస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్

రేగిడి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ దార అప్పలనరసమ్మ అధ్యక్షతన శనివారం జరిగిన మండల సర్వసభ్య సమావేశం వాడీవేడిగా సాగింది. సమావేశం ఆద్యంతం వేతనదారులకు ఉపాధి హామీ పథకం బిల్లుల చెల్లింపుల్లో జరుగుతున్న జాప్యంపై రచ్చ కొనసాగింది. సకాలంలో బిల్లులు చెల్లించకుండా, కాంపోనెంట్ పనులు, టీడీపీ వెండర్లకు ఆ నిధులను ప్రభుత్వం దోచిపెడుతోందని, దీనంతటికీ ఉపాధి అధికారులు వత్తాసు పలుకుతున్నారని సభ్యులు ధ్వజమెత్తారు. తొలుత ఏపీవో ఎస్.హరనాధరావు ఉపాధి పనులపై వివరాలు వెల్లడిస్తుండగా, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ కలుగజేసుకుని గ్రామీణ ప్రాంతాల్లో జరుగుతున్న ఉపాధి పనులకు సంబంధించి వేతనదారులకు ఎప్పటి నుంచి చెల్లింపులు చేయడం లేదో వివరాలు తెలియజేయాలని పట్టుబట్టారు. జనవరి నుంచి వేతనాల చెల్లింపులు నిలిచిపోయాయని ఏపీవో సమాధానమివ్వగా అప్పటి నుంచా అన్నట్లు సభ్యులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. అంతేకాకుండా మండలంలో మొత్తం రూ.2 కోట్ల మేర చెల్లింపులు జరపాల్సి ఉందని తెలియజేయగా అందరూ అవాక్కయ్యారు. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాలకు గ్రామస్తులు వలస వెళ్లకుండా ఉండడంతో పాటు ఉన్న ఊరిలోనే నిరుపేదలకు జీవనోపాధి ఇచ్చే ఉపాధి పథకం బిల్లుల చెల్లింపుల్లో ఇంత ఆలస్యమైతే పేదలు ఎలా బతకాలని ఎమ్మెల్సీ ప్రశ్నించారు. ఆ నిధులు పక్కదారి పడుతున్నా పట్టించుకోరా అని నిలదీశారు. గృహ నిర్మాణంపై జరిగిన చర్చలో ఏఈ ప్రసాద్ మాట్లాడుతూ మండలంలో 2,475 కొత్త ఇళ్లు మంజూరయ్యాయని, ఇంతవరకు 1,947 ఇళ్లు వివిధ నిర్మాణ దశల్లో ఉన్నాయన్నారు. గతంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో మంజూరు చేసిన ఇళ్ల బిల్లులు ఇంకా పెండింగ్‌లో ఉంచి, స్థానిక ప్రజాప్రతినిధులకు ప్రాధాన్యం ఇవ్వకుండా కొత్త ఇళ్లు, బిల్లులు మంజూరు చేసి గత లబ్ధిదారులకు మొండిచేయి చూపొద్దని ఎమ్మెల్సీ అన్నారు. సాగునీటిపై జరిగిన చర్చలో మడ్డువలస ప్రాజెక్టుకు సంబంధించి జేఈ ఎల్.భాస్కరరావు మాట్లాడుతూ కాలువల మరమ్మతుల నిమిత్తం ప్రతిపాదనలు చేశామని తెలియజేయగా, వైస్ ఎంపీపీలు టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్మోహనరావులు జోక్యం చేసుకుని మడ్డువలస, తోటపల్లి పిల్లకాలువలకు సంబంధించి షట్టర్లు, తూములు లేకపోవడంతో ఆయకట్టుకు సాగునీరు అందడం లేదని, ఈ వేసవిలోనే నీరు తక్కువగా ఉన్నప్పుడే మరమ్మతులు చేయాలని డిమాండ్ చేశారు. రెవెన్యూ శాఖపై జరిగిన చర్చలో సీఎస్‌డీటీ రామారావు మాట్లాడుతూ మండలంలో రేషన్‌కార్డుల ఈకేవైసీ 91 శాతం మేర పూర్తయిందని వెల్లడించారు. మండలంలోని 39 పంచాయతీలకు సంబంధించి గతంలో జరిగిన రెవెన్యూ సదస్సుల్లో రేషన్‌కార్డులతో పాటు ఇతర అంశాలపై వచ్చిన ఫిర్యాదులు, పరిష్కరించిన ఫిర్యాదుల వివరాలు ఇవ్వాలని ఎమ్మెల్సీ అడిగారు. అనంతరం విద్య, ఐసీడీఎస్, వెలుగు తదితర శాఖలపై చర్చ జరిగింది. సమావేశంలో ఎంపీడీవో శ్యామలాకుమారి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే ఒత్తిడి లేని విద్య



ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన, ఒత్తిడి లేని విద్య అందివ్వడం జరుగుతుందని అలజంగి గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికలకు సంబంధించి, బొబ్బిలి మండలం, అలజంగి గ్రామంలో శనివారం అడ్మిషన్ డ్రైవ్ నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లిన ఉపాధ్యాయ బృందం.. బడిఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. అలాగే ప్రభుత్వ బడుల్లో విద్యార్థులకు కల్పిస్తున్న సదుపాయాలు వివరించారు. సుశిక్షితులైన ఉపాధ్యాయులచే అత్యుత్తమ విద్యాబోధన చేయడంతో పాటు ఆరోగ్యంపై కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం జరుగుతుందన్నారు. అనంతరం విద్యార్థుల చేతికి ప్లకార్డులు ఇచ్చి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు నిర్మలాదేవి తదితరులు పాల్గొన్నారు. –బొబ్బిలిరూరల్

కాలువ ఇలా.. నీరెళ్లేదెలా?



రాజాం మండలంలోని పొగిరి గ్రామ పంట పొలాలకు సాగునీరందించే తోటపల్లి పిల్ల కాలువ చాలా అధ్వానంగా తయారైంది. పూడికలు, పిచ్చిమొక్కలు, తుప్పలు, డొంకలతో కాలువ ఉండగా, ఇలా ఉంటే సాగు నీరు ఎలా వెళ్తుందని రైతులు ప్రశ్నిస్తున్నారు. గత వేసవిలోనే కాలువను బాగు చేసి, తూములు ఏర్పాటు చేయాలని కోరామని, అయినా ఎవరూ పట్టించుకోలేదని రైతులు ఎస్.అప్పలనాయుడు, కె.వెంకటరమణ, బి.మహేష్, రాము తదితరులు వాపోయారు. ఇప్పటికైనా కాలువ ఆధునీకరణ చేపట్టి, కనీసం ఖరీఫ్ సాగుకైనా నీరందించాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు. –రాజాం

'రన్ ఫర్ జీసస్'



రన్ ఫర్ జీసస్ పేరిట వంగరలో క్రైస్తవులు శనివారం ర్యాలీ నిర్వహించారు. సర్వమానవాళి పాప పరిహారం నిమిత్తం శిలువ మరణం పొందిన ఏసుప్రభువు.. సజీవుడై తిరిగి వస్తున్నాడని ఆయన పునరుత్థానాన్ని వేడుకగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. ఆదివారం ఈస్టర్ పండగను ఘనంగా చేసుకోవాలని, క్రీస్తు అనుసరించిన ప్రేమ, కరుణ, శాంతి మార్గాలను అనుసరించాలని ఫాదర్‌లు తెలిపారు. –వంగర

పరిసరాల పరిశుభ్రతే లక్ష్యం



తెర్లాంలో స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర ర్యాలీలో ఎంపీడీవో రాంబాబు, తహసీల్దారు హేమంత్‌కుమార్

పరిసరాల పరిశుభ్రతే లక్ష్యంగా స్వచ్ఛాంధ్ర–స్వర్ణాంధ్ర కార్యక్రమం శనివారం నిర్వహించారు. గ్రామగ్రామాన జరిగిన ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొని, చీపుళ్లు చేతబట్టి రోడ్లు, వీధులు శుభ్రం చేసి, స్ఫూర్తి నింపారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని, అప్పుడే ఆరోగ్యవంతమైన సమాజం రూపుదిద్దుకుంటుందన్నారు. అనంతరం గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుతామని గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు.

–బొబ్బిలి, రాజాం నెట్‌వర్క్



రామభద్రపురం: స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేస్తున్న ఆర్డీవో రామ్మోహనరావు, ఎంపీడీవో రత్నం, తహసీల్దార్ సులోచనరాణి



సంతకవిటి: జీఎస్‌పురంలో స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో చెత్త ఊడ్చుతున్న మండల ప్రత్యేకాధికారి సోమేశ్వరరావు



బొబ్బిలిరూరల్: పిరిడిలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతామని గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న తహసీల్దారు శ్రీను

చిన్నారుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

రేగిడి: చిన్నారుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ అసిరినాయుడు సూచించారు. మండలంలోని ఉంగరాడ మెట్ట, కేఎంవలస, చాటాయివలస, రేగిడి తదితర గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో వ్యాక్సినేషన్ శనివారం చేపట్టి, చిన్నారులకు వేయాల్సిన వ్యాక్సిన్లు వేశారు. రెండేళ్ల వయసు వరకు చిన్నారులను బాగా చూసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఏఎన్‌ఎంలు తెలిపారు.

పాఠశాలను దత్తత తీసుకున్న ఎమ్మెల్యే

బొబ్బిలి: స్థానిక రెసిడెన్షియల్ పాఠశాలను దత్తత తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే బేబీనాయన ప్రకటించారు. శనివారం ఆ పాఠశాలను సందర్శించిన ఆయన..

అక్కడి ప్రిన్సిపాల్ రఘునాధరావుతో మాట్లాడి, పాఠశాలలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అంతకుముందు ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో జరిగిన గర్భిణుల సీమంతానికి హాజరైన ఆయన.. గర్భిణులకు చీరలు, పండ్లు అందజేసి, ఆశీర్వదించారు. అక్కడి నుంచి మల్లమ్మదేవి పార్కు వద్ద జరిగిన స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్నారు.

లక్ష్మీపురాన్ని సందర్శించిన 'వాష్' కేంద్ర బృందం



జల్ జీవన్ మిషన్ పనులపై ఆరాతీస్తున్న వాష్ కేంద్ర బృంద సభ్యుడు సుధీర్ బండారే

బాడంగి: మండలంలోని లక్ష్మీపురం గ్రామాన్ని వాటర్ అండ్ శానిటేషన్, హైజనిక్(వాష్) కేంద్ర బృందం శనివారం సందర్శించింది. పారిశుధ్యం నిర్వహణ, తాగునీటి వసతులు, జల్ జీవన్ మిషన్ పనులను పరిశీలించారు. ముఖ్యంగా నాలుగేళ్ల క్రితం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో రూ.4 లక్షల వ్యయంతో గ్రామంలో ఏర్పాటు చేసిన రక్షిత మంచినీటి పథకం, ఇంటింటి కుళాయిల ద్వారా తాగునీటి సరఫరా వంటి అంశాలపై బృంద సభ్యుడు సుధీర్ బండారే ఆరాతీశారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పాల్గొని, తాగునీటి ఇబ్బందులు ఏవైనా ఉన్నాయా.. పారిశుధ్య పనులు క్రమం తప్పకుండా చేస్తున్నారా అనే విషయాలను గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. అందరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటిస్తేనే ఆరోగ్యవంతమైన సమాజం రూపొందుతుందన్నారు. అనంతరం గ్రామ శివారులోని ఎస్‌డబ్ల్యూపీసీ(సాలిడ్ వేస్ట్ ప్రాసెసింగ్ సెంటర్), పాఠశాలలను సందర్శించి, పలు సూచనలు చేశారు. ఆ తర్వాత ఆయనను గ్రామస్తులు దుశ్శాలువాతో సత్కరించారు. ఆయన వెంట ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ కవిత, డీఈఈ ఢిల్లీశ్వరరావు, థర్డ్ పార్టీ క్వాలిటీ రిటైర్డ్ ఈఈ వెంకటేశ్వరరావు, ఏఈఈ రాజశేఖరరావు, ఎంపీడీవో రామకృష్ణ సర్పంచ్ పార్వతి, ఎంపీటీసీ గౌరు తదితరులు ఉన్నారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన

రాజాం సిటీ: అగ్నిప్రమాదాలు సంభవించే సమయంలో ఆస్పత్రిలో సిబ్బంది అంతా అవగాహనతో మెలగాలని ఫైర్ ఎస్ఐ టీఎస్ఎస్ జనార్దనరావు సూచించారు. స్థానిక ప్రాంతీయ ఆస్పత్రితో పాటు సన్‌రైజ్ ఆస్పత్రిలో అగ్నిప్రమాదాల నివారణ చర్యలపై శనివారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రాంతీయ ఆస్పత్రి సూపరింటెండెంట్ కరణం హరిబాబు, సన్‌రైజ్ ఆస్పత్రి ఎండీ డాక్టర్ తలే రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

వాహన తనిఖీలు



కారు డిక్కీలో సోదాలు చేస్తున్న పోలీసులు

రాజాం సిటీ: స్థానిక పాలకొండ రోడ్డులోని జీఎంఆర్ ఐటీ వద్ద సంతకవిటి పోలీసులు శనివారం వాహన తనిఖీలు చేపట్టారు. ఎస్ఐ ఆర్.గోపాలరావు ఆధ్వర్యంలో సిబ్బంది వాహనాల ధ్రువపత్రాలు, వాహనదారుల లైసెన్స్‌ను క్షుణ్నంగా పరిశీలించారు. మాదకద్రవ్యాలు రవాణాకు పాల్పడినా, మద్యం అక్రమంగా తరలించినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు.

దరఖాస్తు చేసుకోండి

సంతకవిటి: ప్రభుత్వ భూమిలోని ఇళ్ల రెగ్యులరైజేషన్‌కు సంబంధించి, అనెగ్జర్–2 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దారు బి.సత్యం శనివారం కోరారు. జీవో ఎం.ఎస్ నంబరు 30 ప్రకారం ఆక్రమణలోని ప్రభుత్వ భూమిలో ఉన్న ఇళ్ల రెగ్యులరైజేషన్‌కు సచివాలయంలోని సిబ్బందిని సంప్రదించాలన్నారు. 2019 అక్టోబరు 15వ తేదీ ముందు నిర్మించిన ఇళ్లను రెగ్యులరైజ్ చేయడం జరుగుతుందన్నారు.

సన్మానం

తెర్లాం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కొన్నాళ్ల క్రితం డిప్యుటేషన్‌పై వచ్చి, తిరిగి తాను పనిచేసిన పాఠశాలకు వెళ్తున్న ఉపాధ్యాయుడు ఎస్.రాంబాబును సిబ్బంది, విద్యార్థులు శనివారం సన్మానించారు. అనంతరం ఆయన సేవలను ప్రశంసించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రమేష్ పాల్గొన్నారు.